మా భవిష్యత్తుతో రేవంత్ ఫుట్‌బాల్

విద్యార్థుల ఆందోళనకు చిన్నారుల మద్దతు

సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు విద్యార్థులు చేపడుతున్న ఆందోళనకు మద్దతుగా ప్లకార్డులతో చిన్నారి విద్యార్థినులు

మియాపూర్, ఏప్రిల్ 2: ఫుట్‌బాల్ ఆడుకునేందుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల జీవితాలతో ఫుట్‌బాల్ ఆడుతున్నారని చిన్నారులు ఆవేదన వ్యక్తం చేశారు. విలువైన విశ్వవిద్యాలయ భూములను విక్రయిస్తే తామెక్కడ చదువుకోవాలని వారు ముఖ్యమంత్రిని సూటిగా ప్రశ్నిస్తున్నారు. సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు విద్యార్థులు చేపడుతున్న ఆందోళనకు మద్దతుగా విశ్వవిద్యాలయం లోపలి కేంద్రీయ విద్యాలయానికి చెందిన చిన్నారులు మద్దతు పలికారు. ఈ మేరకు ప్లకార్డులు చేతపట్టి విశ్వవిద్యాలయ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు జాహ్నవి, యశస్వి మాట్లాడుతూ... ఫుట్‌బాల్ ఆడేందుకు వచ్చిన సీఎం భూములని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని, రేపటి రోజున తాము ఎక్కడ చదువుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాలయాల భూములు వేలం వేసి ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్పాలనే సీఎం ఆలోచన సరైంది కాదని, వేలాదిమంది విద్యార్థులకు భవిష్యత్తును ఇచ్చే విద్యాలయాలపై ప్రభుత్వం ఇంతటి కఠినమైన నిర్ణయాన్ని తీసుకోవద్దని వారు కోరారు. తక్షణమే సెంట్రల్ వర్సిటీ భూముల విక్రయం ఆలోచనను మానుకోవాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయంతో పాటు అందులో కొనసాగుతున్న కేంద్రీయ విద్యాలయ సంస్థలను రోడ్డున పడేయవద్దని జాహ్నవి, యశస్వి కోరారు. యూనివర్సిటీలో ఇప్పటికే వేలాది చెట్లను నిర్దాక్షిణ్యంగా తొలగించి వన్యప్రాణులకు గూడు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ పక్షి నెమలి రోదనకు సీఎం రేవంత్ రెడ్డి కారణమని విమర్శించారు.

విద్యార్థులపై దమనకాండ దారుణం

మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): శాంతి యుతంగా నిరసన తెలుపుతున్న హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసులు దమనకాండ చేయడం దారుణమని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ప్రజాపాలన పేరిట రేవంత్ సర్కారు దౌర్జన్యానికి పాల్పడుతున్నదని బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాజ్యాంగాన్ని చేతబట్టుకొని తిరుగుతున్న రాహుల్ గాంధీ.. యూనివర్సిటీ భూములను రేవంత్ సర్కారు తెగనమ్ముతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. 'గతంలో భూముల విక్రయం గురించి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలేంటి? ఇప్పుడు చేస్తున్నదేంటి?' అని నిలదీశారు. 'రేవంత్‌రెడ్డి.. మీ రెండు నాల్కల ధోరణిని ప్రజలు గమనిస్తున్నారు. తగిన సమయంలో బుద్ధి చెప్తారని హెచ్చరించారు. హెచ్‌సీయూ భూములను అమ్మితే బీఆర్‌ఎస్ ఊరుకోబోదని తేల్చిచెప్పారు.

భూములను కాపాడింది బీఆర్‌ఎస్సే

- కేసీఆర్ సూచనతో న్యాయపోరాటం
- రేవంత్‌కు పాలన చేతగావడంలేదు
- ఏఎన్‌ఐతో ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి చెందిన 400 ఎకరాల భూములను కాపాడింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఆ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకత్వంలో న్యాయవాదులు కోర్టుల్లో గట్టిగా పోరాడారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతగావడంలేదని దుయ్యబట్టారు. ఆయన దుశ్చర్యలతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని విమర్శించారు. బుధవారం ఏఎన్‌ఐ వార్తా సంస్థతో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ఆదాయం పడిపోవడం వల్లనే రేవంత్ ప్రభుత్వం భూముల అమ్మకానికి తెగబడుతున్నదని నిప్పులు చెరిగారు. హెచ్‌సీయూకి వేరేచోట 397 ఎకరాలు ఇచ్చామని ప్రభుత్వం వితండవాదనకు దిగడం విడ్డూరంగా ఉందని పేర్కొంటూ.. ఆ భూముల్లోనే పరిశ్రమలను ఎందుకు ఏర్పాటు చేయడంలేదని ప్రశ్నించారు. పర్యావరణాన్ని కాడాల్సిన పాలకులే భూములను చెరబట్టడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. కంచె గచ్చిబౌలి ప్రాంతం ఇప్పటికే కాంక్రీట్ జంగల్‌కు కేరాఫ్‌గా ఉందని, అక్కడ పరిశ్రమల ఏర్పాటుతో మరింత ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో 'మైహోం విహంగ' నిర్మాణానికి భూములు కేటాయించినట్టు సీఎం రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. అదే నిజమైతే ఆ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. 'మైహోం' సంస్థ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు బీజేపీకి చెందినవాడైనందున రేవంత్‌రెడ్డి ఆయన భూములను ముట్టుకొనే ధైర్యం చేయబోరని, పేదలతోపాటు మూగజీవులపైకి బుల్డోజర్లను పంపుతున్న రాష్ట్ర ప్రభుత్వం పెద్దోళ్లను మాత్రం ముట్టుకోవడంలేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

మేధావులారా.. ఎందుకీ మౌనం?

- సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల వీపులు చిట్లుతుంటే కనబడట్లేదా?
- మూసీ, హైడ్రా పేరిట ఇండ్లు ధ్వంసం చేసినా ఎందుకు మాట్లడట్లేదు?
- ఓయూలో సర్క్యులర్‌పై నోరు విప్పట్లేదు?
- తెలంగాణ మేధావులారా ఇప్పటికైనా రండి.. ప్రజల పక్షాన నిలబడండి
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దేశపతి పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): 'నెమళ్లు, జింకలు, పక్షులు, చెరువులు, శిలలకు నెలవైన హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూములను కొట్టేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి జరుగుతుంటే, తమ జీవితాలను పణంగా పెట్టి విద్యార్థులు పోరాడుతుంటే.. తెలంగాణ మేధావులారా.. ఎందుకు మౌనమునుల్లా మారిపోయారు? ఎందుకు విద్యార్థుల తరపున మాట్లాడటం లేదు?' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తెలంగాణ మేధావులను సూటిగా ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇండ్లను కూల్చుతుంటే ప్రొఫెసర్ కోదండరాం లాంటి మేధావులు ఎందుకు వారికి మద్దతుగా నిలవడం లేదు. హెచ్‌సీయూలో దళితులు, బహుజన విద్యార్థుల వీపులు చిట్లుతుంటే.. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఎందుకు వారి పక్షాన మాట్లాడటం లేదు? అనేక జీవాల మనుగడకు ముప్పు వాటిల్లుతున్న తరుణంలో ప్రకృతి ప్రేమికుడు జయరాజ్ ఎక్కడికిపోయారు? లగచర్లలో లంబాడీలపై పోలీసులు విచక్షణారహితంగా దమనకాండ జరుపుతున్నప్పుడు మేధావులు ఎందుకు స్పందించలేదు? సీఎం రేవంత్‌రెడ్డి మేధావుల భుజాలపై నుంచి పాలన చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పాలనలో నోరు విప్పి మాట్లాడిన ఆ మేధావులంతా ఇప్పుడు ఎక్కడికిపోయారు? మేం ప్రజల కోసం పని చేస్తామని, మాది ప్రతిపక్షమని చెప్పేవారిది ఇప్పుడు ఏ పక్షం? 'రోహిత్ వేముల కోసం అప్పట్లో వచ్చిన రాహుల్‌గాంధీ ఇప్పుడు ఎందుకు రావడం లేదు? మేధావులు ప్రజాస్వామిక స్ఫూర్తిని ఎందుకు మర్చిపోయారు? చరిత్రలో దోషులుగా నిలబడే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? సమాజం పట్ల బాధ్యత ఉందా, లేదా? అనేది వారు తేల్చుకోవాలి. 'తెలంగాణ మేధావులారా.. సాహితీవేత్తలారా.. ఇప్పటికైనా మేల్కొనండి' అని దేశపతి పిలుపునిచ్చారు.

తెలంగాణ సర్కార్ దమనకాండ

- హెచ్‌సీయూలో జీవవైవిధ్యం కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు
- వారిపై పోలీసుల అమానుష లాఠీచార్జి
- రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి ఫైర్

రాజ్యసభలో మాట్లాడుతున్న ఎంపీ సురేశ్‌రెడ్డి, చిత్రంలో వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)లో జీవవైవిధ్యం కోసం పోరాడుతున్న విద్యార్థులు, ప్రొఫెసర్లపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దమనకాండను ప్రదర్శిస్తున్నదని బీఆర్‌ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాజ్యసభలో బుధవారం ఆయన హెచ్‌సీయూలో జరుగుతున్న ప్రభుత్వ దమనకాండ గురించి రాజ్యసభలో ప్రస్తావించారు. దేశంలోనే తొలిసారిగా హెచ్‌సీయూ విద్యార్థులు ప్రకృతిని, జీవవైవిధ్యాన్ని కాపాడటానికి ఉద్యమిస్తున్నారని, వారిని కాంగ్రెస్ సర్కారు బుల్డోజ్ చేస్తున్నదని మండిపడ్డారు. మెస్‌చార్జీలు పెంచాలనో, బెటర్ ఫ్యాకల్టీని ఇవ్వాలనో వారు ఉద్యమించడం లేదని, తమ వర్సిటీ పరిధిలోని పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్నారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ వాణిజ్య అవసరాలకు హెచ్‌సీయూ భూములను అక్రమంగా లాగేసుకోవాలని చూస్తున్నదని విమర్శించారు. జీవవైవిధ్యానికి నెలవైన వర్సిటీలో విధ్వంసం సృష్టించి 400 ఎకరాల భూములను అమ్ముకోవాలని చూస్తున్నదని పేర్కొన్నారు. దీనిని అడ్డుకోబోయిన విద్యార్థులు, వారికి మద్దతుగా వెళ్లిన ప్రొఫెసర్లపై కూడా ప్రభుత్వం పోలీసులతో లాఠీచార్జి చేయిస్తున్నదని తెలిపారు. ఓ ఉన్నత విద్యాసంస్థపై కాంగ్రెస్ సర్కారు ఉక్కుపాదం మోపుతున్నదని అభ్యంతరం వ్యక్తంచేశారు. సురేశ్‌రెడ్డి రాజ్యసభలో లేవనెత్తిన మరిన్ని అంశాలు ఆయన మాటల్లోనే కింది విధంగా ఉన్నాయి.

237 రకాల అరుదైన పక్షి, జంతు జాతులు

'హెచ్‌సీయూలో విద్య, పర్యావరణం, న్యాయం కోసం విద్యార్థులు పోరాడుతున్నారు. యూనివర్సిటీ నియమ నిబంధనలకు విరుద్ధంగా హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూమిని తెలంగాణ ప్రభుత్వం అమ్మాలని చూస్తున్నది. తెలంగాణ ప్రాంతంలో వెనుకబాటుతనాన్ని తగ్గించేందుకు, విద్యాభివృద్ధికి, పరిశోధనల కోసం వర్సిటీని 1974లో ఏర్పాటుచేశారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి వర్సిటీ భూములను వాణిజ్య అవరాల కోసం వాడుకోవాలని పాలకులు చూస్తున్నారు. మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వర్సిటీ విద్యార్థులకు మద్దతుగా నిలిచారు. వర్సిటీ పరిధిలోని అటవీ ప్రాంతంలో 237 రకాల అరుదైన పక్షులు, జింకలు, పాములతోపాటు రాక్స్, లేక్‌లు ఉన్నాయి. ప్రకృతి, జీవ వైవిధ్యాన్ని ధ్వంసం చేయడాన్ని మా పార్టీ వ్యతిరేకిస్తున్నది. అటవీ పర్యావరణ పరిరక్షణ చట్టానికి తెలంగాణ ప్రభుత్వం తూట్లు పొడుతున్నది. వర్సిటీలో 5,000 మందికి పైగా బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు చదువుతున్నారు. వారు మెస్‌చార్జీలు పెంచాలనో, బెటర్ ఫ్యాకల్టీ ఇవ్వాలనో ఉద్యమించడం లేదు. తమ వర్సిటీ పరిధిలోని ప్రకృతిని, జీవవైవిధ్యాన్ని కాపాడాలని ఉద్యమిస్తున్నారు. విద్యార్థులు, ప్రొఫెసర్లు అని చూడకుండా ప్రభుత్వం దాష్టీకం ప్రదర్శిస్తున్నది. వారిని పోలీసులతో ఈడ్చిపడేసి లాఠీచార్జి చేయిస్తున్నది. అది అత్యంత దారుణమైన చర్య' అని సురేశ్‌రెడ్డి ధ్వజమెత్తారు.

హెచ్‌సీయూ విద్యార్థులపై అమానుషం

- లాఠీలతో కొడుతున్న పోలీసులు
- ఉద్యమనాటి రోజులను గుర్తు చేస్తున్నరు: ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ (హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ) విద్యార్థులపై కాంగ్రెస్ సర్కార్ అమానుష చర్యలకు దిగుతున్నదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆందోళన వ్యక్తంచేశారు. వర్సిటీ హాస్టల్ గదుల్లో నుంచి విద్యార్థులను పోలీసులు బయటకు లాక్కొచ్చి మరీ లాఠీలతో కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని లాక్కోవాలని కాంగ్రెస్ సర్కారు చూస్తున్నదని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులపై పోలీసులు దమనకాండకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. పోలీసుల లాఠీచార్జిని ఖండిస్తున్నట్టు చెప్పారు. సెంట్రల్ యూనివర్సిటీలో అన్ని రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఉన్నారని, వారిపై పెట్టిన కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులపై జరిపిన అమానుష లాఠీచార్జిని మళ్లీ గుర్తుకు తెస్తున్నారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు ఆ యూనివర్సిటీ పూర్వవిద్యార్థులేనని, వారికీ ఆ యూనివర్సిటీ గురించి పట్టింపు లేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీ బాసుల జేబులు నింపడం కోసమే గల్లీ భూములను కాంగ్రెస్ పాలకులు తెగనమ్ముతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో నాటి చంద్రబాబు నాయుడు పాలనకు, నేడు సీఎం రేవంత్‌రెడ్డి పాలనకు ఏ మాత్రం తేడా లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో భూములపై కాంగ్రెస్ సర్కారు కన్ను పడిందని, వాటిని అమ్మి పాలన చేస్తున్నారని ధ్వజమెత్తారు.

టీజీఐఐసీపై అటవీ శాఖకు ఫిర్యాదు

హెచ్‌సీయూ భూములను పరిరక్షించాలని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూకి చెందిన కంచ గచ్చిబౌలిలోని భూముల్లో పర్యావరణానికి రాష్ట్ర ప్రభుత్వం, టీజీఐఐసీ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వైల్డ్‌లైఫ్ చీఫ్ వార్డెన్ మెరూకు బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు ఫిర్యాదు చేశారు. బుధవారం అరణ్య భవన్‌లో ఈ మేరకు ఫిర్యాదు కాపీని అందజేశారు. అటవీ సంరక్షణ చట్టం 1980, వన్యప్రాణుల రక్షణ చట్టం 1972లను ఉల్లంఘించారని, బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చిరుమళ్ల రాకేశ్, కురువ విజయ్‌కుమార్, కిశోర్‌గౌడ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సాక్షిగా.. హెచ్‌సీయూను కాపాడుకుంటాం!

చేంజ్ డాట్ ఆర్గ్‌లో ఉద్యమం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ పర్యావరణాన్ని నాశనం చేయడానికి కుట్రలు చేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌పై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. పక్షులు, జంతువులు, క్షీరదాలు, సరీసృపాలు, అరుదైన కొండల ఉనికిపై జేసీబీ దాడిని పర్యావరణ ప్రేమికులు, విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అందులో భాగంగా సోషల్ మీడియాలో చేంజ్ డాట్ ఆర్గ్ వెబ్‌సైట్‌లో హెచ్‌సీయూను కాపాడుకుందామంటూ సంతకాల సేకరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. 1.50 లక్షల సంతకాలను లక్ష్యంగా నిర్దేశించుకుంటే ఇప్పటికే 1,33,029 మంది సంతకాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ స్వార్థపూరిత ఆలోచనలకు పర్యావరణాన్ని బలిచేయొద్దంటూ సంతకాలతో నిరసన తెలిపారు. అనేక దేశాల్లో భూకంపాలు, వరదలతో ప్రజలు మరణిస్తున్న ప్రస్తుత తరుణంలో పర్యావరణాన్ని రక్షించకుండా అడవులను నాశనం చేసి, భూములు విక్రయించాలని చూడటం సహేతుకం కాదని పర్యావరణవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సేవ్ హెచ్‌సీయూ బయోడైవర్సిటీ అంటూ సోషల్ మీడియాలో నినదించారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని విమర్శిస్తూ పోస్టులు పెట్టారు.

కేసీఆర్‌ది హరితహారం.. కాంగ్రెస్‌ది హరితసంహారం

- విద్యార్థులపై లాఠీచార్జిని తీవ్రంగా ఖండిస్తున్నాం
- హెచ్‌సీయూ భూమిపై ప్రభుత్వం చీకటి ఒప్పందం
- స్టూడెంట్స్ పోరాటం రాహుల్ గాంధీకి కనిపిస్తలేదా?
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్


మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కేసీఆర్ సీఎంగా ఉన్నపుడు హరితహారం చేపడితే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి హరిత సంహారానికి పూనుకున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం ఆందోళన చేపడుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జిని బీఆర్‌ఎస్ తీవ్రంగా ఖండిస్తున్నట్టు జగదీశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పల్లా ప్రవీణ్‌రెడ్డి, వల్లమల్ల కృష్ణ, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు రాస్తున్న మీడియా ప్రతినిధులు, తమ భూములు లాక్కోవడాన్ని వ్యతిరేకిస్తూ తిరుగుబాటు చేస్తున్న రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా కేసులు పెట్టి హింసిస్తున్నదని మండిపడ్డారు. ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న హెచ్‌సీయూని కాపాడుకునేందుకు విద్యార్థులు ఆందోళనలు చేసే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రులు మంగళవారం మీడియా సమావేశంలో విద్యార్థులపై అక్కసు వెళ్లగక్కి వాళ్లను పెయిడ్ బ్యాచ్ అని అవమానించారని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులే పెయిడ్ బ్యాచ్ అని విమర్శించారు. నాడు గురువు చంద్రబాబు హెచ్‌సీయూ భూములను తాబేదార్లకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తే, నేడు ఆ భూములను శిష్యుడు రేవంత్‌రెడ్డి పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే యూనివర్సిటీ అధికారులతో మాట్లాడి పోలీసులను లోపలికి రాకుండా ఆపొచ్చని, ఇది బీజేపీ, కాంగ్రెస్ కలిసి ఆడుతున్న నాటకం అని ఆరోపించారు. హెచ్‌సీయూలో 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అయితే దొంగల్లా అర్ధరాత్రి ఎందుకు వెళ్లారని మండిపడ్డారు. హెచ్‌సీయూ విద్యార్థుల పోరాటం రాహుల్‌గాంధీకి కనిపిస్తలేదా? అని ప్రశ్నించారు. ముడుపుల కోసమే రాహుల్‌గాంధీ మాట్లాడటం లేదని ఆరోపించారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి: విమలక్క



హిమాయత్ నగర్, ఏప్రిల్ 2: హెచ్‌సీయూ భూములను అమ్మివేసి, జీవవైవిధ్యాన్ని విధ్వంసం చేయడం సరికాదని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క, ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షుడు భద్ర, పీడీఎస్‌యూ నేత విజయ్ తెలిపారు. బుధవారం హైదర్‌గూడలో వారు మీడియాతో మాట్లాడారు. హెచ్‌సీయూ భూముల్లో వన సంపదతోపాటు అనేక జీవరాశులు జీవిస్తున్నాయని తెలిపారు. హెచ్‌సీయూలో జరుగుతున్న పరిణామాలు విద్యా వాతావరణాన్ని దెబ్బతీస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వవిద్యాలయాల భూములపై కన్నేసిందని ఆరోపించారు. ప్రకృతి విధ్వంసం నేపథ్యంలో ప్రజలు దీన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు రమేశ్, రాకేశ్ పాల్గొన్నారు.

విధ్వంసాన్ని ప్రభుత్వం ఆపాలి

- ప్రతిపక్షాలు విద్యార్థులను రెచ్చగొడుతున్నాయనడం సరికాదు
- ప్రొఫెసర్ హరగోపాల్

రవీంద్రభారతి, ఏప్రిల్ 2: కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో ప్రభుత్వం చేస్తున్న ప్రకృతి విధ్వంసాన్ని తక్షణమే ఆపాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలు విద్యార్థులను రెచ్చగొడుతున్నాయని ఆరోపించడం సరికాదని, అభివృద్ధి పేరుతో చెట్లు, పక్షులు, చెరువులు, గుట్టలను ధ్వంసం చేసుకుంటూపోతే హైదరాబాద్ మరో ఢిల్లీ లాగా మారిపోవడం ఖాయమని ఆయన హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో పౌరసమాజ మేధావులు, కార్యకర్తలు, హెచ్‌సీయూ విద్యార్థులతో కలిసి ప్రొఫెసర్ హరగోపాల్ మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే వంద ఎకరాల్లో విధ్వంసం చేశారని, ఇంత హడావుడిగా చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. మరో 300 ఎకరాల్లో ఉన్న జీవరాశులనైనా కాపాడాలని డిమాండ్ చేశారు. 1969లో 360 మంది విద్యార్థుల బలిదానం వల్ల హెచ్‌సీయూ ఏర్పడిందని గుర్తుచేశారు. హెచ్‌సీయూలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యారని, అలాంటి వర్సిటీని ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వాలు నడుచుకోవాలని హితవు పలికారు. అభివృద్ధి పేరిట ప్రకృతిని నాశనం చేసే అధికారం ఎవరిచ్చారని ధ్వజమెత్తారు. 2003లో చంద్రబాబు వర్సిటీ వినాశనానికి పునాదులు వేశారని, రెండు దశాబ్దాల తర్వాత రేవంత్‌రెడ్డి ఆయన బాటలో నడుస్తూ విధ్వంసానికి నాందిపలికారని మండిపడ్డారు. అభివృద్ధి అంటే ప్రకృతిని నాశనం చేయడమా, ప్రకృతిని నాశనం చేసి సంపదను సృష్టిస్తారా? అని ప్రశ్నించారు.


బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ఢిల్లీలో కోదండరాంకు నిరసన సెగ

సమాధానం చెప్పలేక జారుకున్న నేత

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కోదండరాంకు హెచ్‌సీయూ భూములపై విద్యార్థుల నిరసన సెగ తగిలింది. బుధవారం ఢిల్లీలో కలిసిన ఎమ్మెల్సీ కోదండరాంను హెచ్‌సీయూ విద్యార్థులు చుట్టుముట్టి ప్రశ్నలవర్షం కురిపించారు. హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం అమ్మేస్తున్నా ఎందుకు మాట్లాడటం లేదని విద్యార్థులు నిలదీశారు. కోదండరాం నేరుగా సమాధానం చెప్పకుండా దాటవేస్తూ మాట్లాడారు. చివరకు విద్యార్థుల ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరైన ఆయన అక్కడి నుంచి జారుకున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'పదవి లేకపోతే అభ్యుదయ వాదులు, పదవి వచ్చాక కాగితం పులులుగా మారిపోయారు' అంటూ సోషల్ మీడియా వేదికలపై నెటిజన్లు ఏకి పారేశారు.

ప్రజాస్వామికవాదులు ఖండించాలి: కర్నె

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూలో విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా చేసిన దాడిని ప్రజాస్వామికవాదులు ఖండించాలని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ కోరారు. విద్యార్థుల పోరాటానికి అందరూ అండగా నిలువాలని సూచించారు. '1969లో తెలంగాణ కావాలన్న విద్యార్థులను కాల్చి చంపేసింది కాంగ్రెస్. మలి దశ ఉద్యమంలో వందల మంది చావులకు కారణమైంది కాంగ్రెస్. ఇప్పుడు విద్యార్థులపైనా దాడికి కారణమైంది కాంగ్రెస్. హెచ్‌సీయూలో జరుగుతున్న న్యాయమైన పోరాటానికి బీఆర్‌ఎస్ పూర్తిగా అండగా ఉంటది' అని కర్నె ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రాహుల్ నోరు మెదపరెందుకు?

మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్



హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): గతంలో అనేకసార్లు హెచ్‌సీయూకి వచ్చి విద్యార్థుల పోరాటాలకు మద్దతు పలికిన రాహుల్ గాంధీ ఇప్పుడు నోరుమెదపరెందుకని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ప్రశ్నించారు. విద్యార్థుల పట్ల కర్కషంగా వ్యవహరిస్తే ఆ విద్యార్థులే ఈ ప్రభుత్వాన్ని కూలదోస్తారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అందరం విద్యార్థులకు అండగా ఉందామని, వర్సిటీ భూములను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

రాజ్యాంగంతో తిరుగుతున్న రాహుల్ ఎక్కడ?

బీఆర్‌ఎస్వీ నేత పడాల సతీశ్



హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిపిన లాఠీచార్జిని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సెంట్రల్ యూనివర్సిటీల భూములను కూడా వదిలి పెట్టడం లేదని, దేశంలో నంబర్‌వన్ 420 రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. గతంలో ఇదే హెచ్‌సీయూను రాజకీయంగా వాడుకొని అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్.. నేడు వర్సిటీ విద్యార్థులపై లాఠీచార్జితో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచిందని విమర్శించారు. రాజ్యాంగం పట్టుకుని తిరుగుతున్న రాహుల్ గాంధీ ఇప్పుడు ఎక్కడికిపోయారని ప్రశ్నించారు.

విద్యార్థులపై లాఠీచార్జ్ దుర్మార్గం

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం దుర్మార్గమని, వెంటనే పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల విషయంలో మొండిగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు.